# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 19 అక్టోబరు , 2026 | పేజీలు : 4











# ఘనంగా సద్దుల బతుకమ్మ



### వాడవాడలా అంబరాన్నంటిన బతుకమ్మ వేడుకలు

### బతుకమ్మ పాటలతో ఆడి పాడిన మహిళలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం సూర్యాపేట జిల్లాలో మహిళలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో ఉదయమే కొత్త బట్టలు ధరించి బతుకమ్మను పేర్చి అందులో పసుపుతో తయారు చేసిన గౌరమ్మను మీద పెట్టి ఇంట్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళలో ఆయా ప్రాంతాల్లో బతుకమ్మల చుట్టూ చేరి సాంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలు ఆడి అనంతరం దగ్గర లోని చెరువులు, కుంటలు, కాలువల్లో నిమజ్జనం చేశారు. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి, డిజె సౌండ్‌లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. బతుకమ్మ పండుగ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు.



## రజక సంక్షేమ భవన నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లా కేంద్రంలోని రజక సంక్షేమ భవన కమిటీ సమావేశం శనివారం జరిగింది. సెప్టెంబర్ 25న రజక సంక్షేమ భవన కమిటీ అధ్యక్షుడు ఆమంచి అంజయ్య అకాల మరణం చెందడంతో పాటు పాత కమిటీ కాలపరిమితి ముగియడంతో పాత కమిటీని రద్దు చేశారు. పాత కమిటీలో 19 మంది సభ్యులు ఉండగా 12 మంది మెజారిటీ తీర్మానంతో రద్దు చేస్తూ 31 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా చిలకరాజు చెన్నయ్య,గౌరవాధ్యక్షుడిగా చిక్కుల రాములు,కార్యనిర్వాహక అధ్యక్షులుగా సట్టు సత్తయ్య,రేవెల్లి అంజయ్య,గౌరవ సలహాదారుగా ఎలిజాల సత్తయ్య,ప్రధాన కార్యదర్శిగా చిలకరాజు సతీష్ కుమార్,కోశాధికారిగా జంజిరాల శేఖర్ ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా భూతరాజు శ్రీను,లగడపురం వెంకన్న,పగిడిమర్రి శ్రీనివాస్,సహాయ కార్యదర్శులుగా చిక్కుల శంకర్,పగిళ్ల వెంకన్న,అక్కెనపల్లి ఈదయ్య,కార్యదర్శులుగా దామనూరు శ్రీను,భీమనపల్లి శంకరయ్య లు ఎన్నికయ్యారు.అదేవిధంగా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గా ఎన్నికైన భీమనపల్లి శ్రీకాంత్ ను ఈ సందర్భంగా సన్మానించారు.

## రజక భవన కమిటీ నుంచి ముగ్గురిని సస్పెన్షన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్డులో ఉన్న రజక భవన కమిటీ నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ చిలకరాజు చెన్నయ్య, గౌరవ సలహాదారు చిక్కుల రాములు,కార్యదర్శి చిలకరాజు సతీష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు నూతన అధ్యక్షుడు దామెర వేణు తెలిపారు. సెప్టెంబర్ 25న రజక భవన కమిటీ అధ్యక్షుడు ఆమంచి అంజయ్య మరణించారు.ఆయన స్థానంలో తాత్కాలిక నూతన అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు అక్టోబర్ 11న సమావేశం జరిగింది.అనంతరం అక్టోబర్ 16న జరిగిన సమావేశంలో పద్ధతి ప్రకారం మెజారిటీ సభ్యుల అభిప్రాయంతో తాత్కాలిక అధ్యక్షుడిగా దామెర వేణును, ప్రధాన కార్యదర్శిగా అక్కెనపల్లి లక్ష్మయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.అయితే కమిటీకి తెలియకుండా రజక భవన తాళాలు విరగ్గొట్టి సంఘ వ్యతిరేక కార్యక్రమానికి పాల్పడినందున పై ముగ్గురిని కమిటీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

# వరి పంట వేయొద్దు



వివరాలు మెయిన్‌లో

### ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి

### వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్



## యువత స్వయం శక్తితో ఎదగాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** యువత స్వయం శక్తితో జీవితంలో స్థిర పడాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వడ్త్య తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల కారోబార్ తండాలో నేనావత్ వినోద్ నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణ షాపును వడ్త్య రమేష్‌నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వడ్త్య తండా సర్పంచ్ నేనావత్ సర్ధార్‌నాయక్, మాజీ సర్పంచ్ వడ్త్య బలరాంనాయక్, లాలునాయక్, రవీందర్, వినోద్, దీప్ల, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/మోతె :** మండలంలోని విభాళాపురం గ్రామంలో నిమ్మర శ్రీకాంత్ అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారణ చేపట్టారు. మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో శుక్రవారం రాత్రి దుర్గామాత విగ్రహం వద్ద అన్నదానం చేయగా శనివారం ఉదయం 11 గంటలకు టెంటు, గిన్నెలు కడుతున్న సమయంలో నిమ్మర శ్రీకాంత్ (28) పనస శ్రీలత భర్త శ్రీనివాసులుకు స్వల్ప ఘర్షణ జరిగింది. మాట పెరిగి శ్రీలత శ్రీకాంత్‌పై కర్రతో దాడి చేయగా శ్రీకాంత్ తలకు తీవ్ర గాయమైంది. ఆమె భర్త శ్రీనివాసు కూడా శ్రీకాంత్‌పై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. శనివారం రాత్రి శ్రీకాంత్ నిద్రిస్తుండగా సుమారు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఫిడ్స్ వచ్చి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఘటన స్థలాన్ని మునగాల సిఐ ప్రతాప్ లింగం, ఎస్ఐ లచ్చిరెడ్డితో కలిసి గ్రామంలో విచారణ చేపట్టారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత తెలుస్తుందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి శ్రీపతి అంజయ్య మృతి



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండలం పుల్లెంల గ్రామ పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీపతి అంజయ్య (49) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం నల్లగొండ సమీపంలోని ఎస్ఎల్‌బిసి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో ,ప్రజలతో ఆత్మీయంగా మెలిగే అంజయ్య ఆకస్మిక మరణం తోటి ఉద్యోగులను ,స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని చండూరు ఎంపిడిఓ బండారు యదగిరి అన్నారు. పంచాయితీ కార్యదర్శి అంజయ్య మృతి పట్ల మండల పంచాయితీ కార్యదర్శులు , రెవిన్యూ , పంచాయితీరాజ్ అధికారులు , ప్రజా ప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## బుల్లెట్ ట్రైన్ సాధన రిలే నిరాహార దీక్షలకు విరామం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బుల్లెట్ ట్రైన్ రైల్వే కారిడార్ సాధన లక్ష్యంగా గత 90 రోజులుగా కొనసాగుతున్న పలు ఉద్యమ రూపాలలో, ఉద్యమంలో భాగంగా 65 రోజులుగా రిలే నిరాహార దీక్షలకు కొద్ది రోజులు విరామం ప్రకటిస్తున్నట్లు బుల్లెట్ ట్రైన్ సాధన కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాధన సమితి నాయకులు పెద్దిరెడ్డి రాజా నివాసంలో జరిగిన ఉద్యమ సమన్వయ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రియమైన బతుకమ్మ, తెలంగాణ ప్రజలకు పెద్ద పండుగ దసరా, దీపావళి పండుగల సందర్భంతోపాటు రాష్ట్ర ముఖ్య మంత్రి, కేంద్ర రైల్వే మంత్రిని ఢిల్లీలో కలిసి బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ డిమాండ్ చేస్తూ వినతిపత్రం ఇచ్చేందుకు కమిటి ఆధ్వర్యంలో వెళ్లాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమాల కారణంగా దీక్షలు కొద్ది



రోజులు వాయిదా వేయాలని ఉద్యమ సమన్వయ కమిటి తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు పెద్దిరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి రాజా, రమణాచారి, ధర్మార్జున్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, చలమల్ల నరసింహ, కొత్తపల్లి శివకుమార్, బూర వెంకటేశ్వర్లు, వెలుగు వనిత, భూపతి రాములు, మట్టిపెల్లి సైదులు, కొనుకుంట్ల సైదులు, నేరెళ్ల మధు, అఖిల్ పాల్గొన్నారు.

## క్రీడాభిమానులను అలరిస్తున్న క్రికెట్ పోటీలు



**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ స్కూల్ నందు దసరా పండుగ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ క్రీడాభిమానులను అలరిస్తోంది. మొత్తం 40 జట్లు పాల్గొనగా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు స్నేహభావాన్ని పెంచేందుకు ఈ టోర్నమెంట్ దోహదపడుతుంది. ఈ టోర్నమెంట్‌లో ప్రెస్‌క్లబ్ చింతలపాలెం టీం అద్భుతంగా తమ ఆటను ప్రదర్శించింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గోపిరెడ్డి హ్యాట్రిక్ వికెట్లు సాధించి, లీగ్ మ్యాచ్ విజయాన్ని కైవసం చేసుకున్నారు. ఆదివారం లీగ్ మ్యాచ్‌లు పూర్తికానున్నాయని నిర్వాహకులు మామిడి వెంకటేశ్వర్లు, హనుమంతరావు, సాయి, దుర్గారావు, అనిల్, నవీన్, రవి, సిహెచ్ వీరబాబు తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.

## దేవాలయల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** గ్రామాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడంతోపాటు, ప్రజల విశ్వాసాలకు ప్రతీకలుగా నిలిచే దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లింగాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న శివాలయాన్ని ఆయన సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా పూర్తి చేయాలన్నారు. శివాలయం నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు మరింత ఆధ్యాత్మిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక



పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలందరికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## పట్టభద్రుల ఓటు నమోదు

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలో పట్టభద్రుల ఓటు నమోదు స్టాల్‌ను హుజూర్‌నగర్ నియోజక వర్గ బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లగొండ ఖమ్మం వరంగల్ పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున డిగ్రీ పూర్తి అయిన అభ్యర్థులు అందరూ తమ ఓటు కోసం నవంబర్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్టాల్ నందు ఉచితంగా ఓటును ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని గ్రాడ్యుయేట్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి, ఉప సర్పంచ్ జంగాల అనంతమ్మ పుల్లయ్య, మల్కాపురం ఉపసర్పంచ్ మేడిశెట్టి నరసింహారావు, సోమ వెంకటేశ్వర్లు నాయకులు పాల్గొన్నారు.



## సద్దుల బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఆదివారం సద్దుల బతుకమ్మను ఆడపడుచులు ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు తీరొక్కపూలతో వివిధ అలంకరణలతో బతుకమ్మలను పేర్చి ఆడపడుచులు అంతా ఒక చోట చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ డిజె పాటలతో కోలాహలంగా సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## దసరా పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలి

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లా ప్రజలందరూ దసరా పండుగను సంతోషంగా, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ కోరారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. పండుగవేళ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దసరా సెలవుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడపకూడదని తెలిపారు. ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి వెళ్లే వారు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇంటి భద్రత కోసం సిసి కెమెరాలు, అలారం వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 112 సంప్రదించాలన్నారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712686026, 8712686057 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

## ఈఎల్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/చండూరు:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని చండూరులో ఈఎల్‌వీ ఫౌండేషన్ ఆధర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఈఎల్‌వీ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగుదిడ్ల భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఈఎల్‌వీ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగుదిడ్ల భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు భావితరాలకు అందించడంతో పాటు మహిళల్లో ఐక్యతాభావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. అనంతరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్న హహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు సంగెపు సువర్ణ , ఇరుగుదిడ్ల అశోక్ , వరికుప్పల సురేష్ , రావిరాల రాజేంద్రప్రసాద్ , గంజి అశోక్ , బండమీది కిరణ్ , కాటం రాంబాబు , బోయపల్లి శేఖర్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

**ప్రజాపక్షం/చిట్యాల:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ళ పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా బిజెపి ఎస్‌సి మ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆదివారం పట్టణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి పట్టణ అధ్యక్షులు గుండాల నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్‌సి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రుద్రవరం లింగస్వామి మాట్లాడుతూ నరేంద్రమోదీ 13 ఏండ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, గత 12 ఏండ్లుగా భారత ప్రధానిగా దేశ ప్రజలకు సేవలందిస్తూ 25 సంవత్సరాల ప్రజా పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చికిలంమెట్ల అశోక్, కూరెళ్ళ శ్రీనివాస్, జయారపు రామకృష్ణ, కంచర్ల శంకర్‌రెడ్డి, వైరాల రాహుల్ పాల్గొన్నారు.



## రైతు కల్యాణ్‌కు బిజెపి జిల్లా యువజన మోర్చ ప్రధాన కార్యదర్శిగా నియామకం

**ప్రజాపక్షం/నడిగూడెం:** భారతీయ జనతా పార్టీ జిల్లా యువమోర్చ ప్రధాన కార్యదర్శిగా రౌతు కళ్యాణ్ నియామకం జరిగింది. రౌత్ కళ్యాణ్ నియామకం పట్ల బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు బందారు వీరబాబు యాదవ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బందారు కవితారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి రౌత్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రౌతు కళ్యాణ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి యువతను రాజకీయాల్లో చైతన్యవంతులను చేయడానికి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆయన కృషి చేస్తానన్నారు. తన నియమానికి సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం చండూరు:** చండూరు మండలపరిదిలోని పుల్లెంల గ్రామ పంచాయితీకార్యదర్శిగా విధులు నిర్వ హిస్తున్న శ్రీపతి అంజయ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆదివారం తన స్వగ్రామం చల్మాయిగూడంలో ఆయన మృతదేహానికి పుల్లెంల గ్రామ సర్పంచ్ ముక్కాముల వెంకన్నయాదవ్, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చి, 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఊషయ్య, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి శివర్ల లింగస్వామి, వార్డు సభ్యులు నకిరె కంటి రాజు, భూతరాజు బాలరాజు, నీలకంఠం స్వామి, బొడ్డు సైదులు, మాజీ ఎంపిటిసి సీత యాదయ్య పాల్గొన్నారు.

## ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ

**ప్రజాపక్షం/మునుగోడు:** పట్టణంలోని చిట్యాల రోడ్డులో శనివారం ప్రమాదం జరిగింది.వేగంగా వచ్చిన ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది.ఢీకొన్న ధాటికి స్తంభం విరిగి పక్కనే ఉన్న ఫర్నిచర్ దుకాణంపై పడిపోయింది. దీంతో దుకాణంలోని డోర్లు ధ్వంసం అయ్యా యి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో ఆ ప్రాంతంలో సుమారు 4 గంటల పాటు కరెంట్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



# ఎంపిడిఓ జోగు శ్రీనివాస్‌రెడ్డి ఘన సన్మానం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండల పరిధిలోని వేప లసింగారం గ్రామంలో ఆదివారం 1986వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మఠంపల్లి వివి హెచ్ఎస్‌లో 1986 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తమ తోటి విద్యార్థి జోగు శ్రీనివాసరెడ్డి ఇటీవల పదోన్నతిపై తిరుమలగిరి సాగర్ ఎంపిడివో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను బాల్య మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు శ్రీనివాసరెడ్డికి పూల మాలలువేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరి పాఠశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు తరగతి గదిలో జరిగిన సరదా సంఘటనలు, చిన్ననాటి స్నేహాలు, విద్యార్థి దశలోని అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సమ్మిడి శ్రీనివాసరెడ్డి, తాటికొండ సత్యనారాయణరెడ్డి, చిట్యాల అనంతరెడ్డి, మర్ల జనార్ధన్‌రెడ్డి, కిష్టపాటి వెంకటరెడ్డి, మోర్తాల మట్టారెడ్డి, కీతరామ్‌నాథ్, మన్నెం నర్సింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయించాలని ఎట్టి పరిస్థితుల్లో దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకే వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని జూలూరు సింగిల్‌విండో చైర్మన్ కళ్ళెం రాఘవరెడ్డి రైతులను కోరారు.ముందస్తు చర్యల నిమిత్తం ఆయన శనివారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు పొలంనుండి తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి అధికారులు కొనుగోలు చేసే వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.దసరా తర్వాత ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.గిట్టుబాటు ధరకు తక్కువగా అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు.హామాలీలు,టార్పలిన్ కవర్స్,ట్రన్స్‌పోర్టు,మిల్లుల కేటాయింపు,గోదాములు,కొనుగోలు కేంద్రాల వద్ద పని చేసే సిబ్బంది ముందస్తుగానే సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.నిర్ణయించి తేమ శాతం రాగానే యధేచ్ఛగా ఎలాంటి అపోహలకు తావులేకుండా ధాన్యం విక్రయించవచ్చని తెలిపారు.పెద్దరావులపల్లి కప్రాయిపల్లి,జూలూరు,పెద్దగూడెం,జగత్ పల్లి,పిలాయిపల్లి ఆరు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్ళు చేసేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు.దసరా వెంటనే కాంట మొదలవుతుందని రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని మీడియా ముఖంగా చెప్పారు. ఈ సీజన్‌లో వచ్చిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు మేలు చేస్తుందని భరోసా ఇచ్చారు.

# పండుగ సాయన్న ముదిరాజ్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాబిన్ హుడ్, ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతిని పురస్కరించుకొని పోస్టర్, కరపత్రాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో జాగీర్దార్లు, జమీందార్ల దోపిడీకి గురైన బహుజన వర్గాలకు అండగా నిలిచి, పెత్తందార్ల గడీలను కొల్లగొట్టి పేదలకు తిండి గింజలు పంచిన మహనీయుడు పండుగ సాయన్న అని అన్నారు. సాయన్నను జమీందార్లు కుట్రపన్ని చంపించారని తెలిపారు.సాయన్న సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి,వర్ధంతి నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 22న ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహించే 174వ జయంతి కార్యక్రమానికి విజయవంతం చేయాలని కోరారు.నల్లగొండ పట్టణంలో పండుగ సాయన్నతో పాటు తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలోపండుగ సాయన్న విగ్రహ స్థాపన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు కేశబోయిన శంకర్ ముదిరాజ్,జిల్లా అధ్యక్షుడు నల్ల సోమమల్లయ్య,ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొల్లా వెంకట్ ముదిరాజ్,అసోసియేట్ ప్రెసిడెంట్ లోకనబోయిన రమణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ నాయకుడు గుమ్మల మోహన్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్,కార్పొరేటర్లు అల్లి సుభాష్ యాదవ్,కేసాని వేణుగోపాల్ రెడ్డి,రేగట్టే అండాలు లింగస్వామి గౌడ్, సంఘం ఉపాధ్యక్షుడు దుడ్డు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోవర్ధన్ రావు కన్నుమూత



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు దేవులపల్లి గోవర్ధన్ రావు (85) అక్టోబర్ 14న సాయంత్రం 7:05 గంటలకు నల్లగొండ పట్టణంలో కన్నుమూశారు.ఆయన స్వగ్రామం ప్రస్తుత సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం బొప్పారం. విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పని చేస్తూనే ఐఎన్‌టియూసీ నాయకుడిగా సేవలందించారు.2008 నుంచి 2010 వరకు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.సీనియర్ కాంగ్రెస్ నాయకుడు,ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా,ఏఐసీసీ సభ్యుడిగా,వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గాంధీ భవన్‌లో సుదీర్ఘకాలం సేవలందించిన డి.వి.సత్యనారాయణ రావుకు ఆయన సోదరుడు. అక్టోబర్ 25వ తేదీ ఆదివారం నల్లగొండ పట్టణంలోని రామగిరిలో కుటుంబ సభ్యులు 12వ రోజు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



## గ్రాడ్యుయేట్లు హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ తమ ఓటు నమోదు చేసుకునేందుకు హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు సుంకరి సుజాత, గాయం సురేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మాపురం గ్రామంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లికొండ మనోహర్, గుండు వెంకన్న, కోక హుస్సేన్, దొంగరి కనకయ్య, పిట్టల రామకృష్ణ, జనార్ధన్, నారాయణరెడ్డి, ముక్కెర్ల విక్రమ పాల్గొన్నారు.

## పెద్దతండా ప్రజల నీళ్ల కష్టాలు తీర్చిన గ్రామ సర్పంచ్...



**ప్రజాపక్షం/డిండి;** ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయడమే ప్రధాన లక్ష్యం అని పెద్ద తండా సర్పంచ్ కాట్రావత్ చిట్టెమ్మ శంకర్‌నాయక్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని పిల్లలు, పెద్దలు ఇంటిల్లిపాది ఎంతో ఆనందంగా జరుపుకునే దసరా పండుగను ఎలాంటి అవాంతరాలు లేకుండా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా మోటార్లను బిగించి తాగునీటి కోసం చర్యలు చేపట్టారు. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తగా తాగునీటి కష్టాలను తీర్చేందుకు బోర్లలో మోటార్లు వేయించి నీటి కష్టాలు తీర్చారు. దసరా పండుగ సందర్భంగా గ్రామంలో సర్పంచ్ ప్రజా శ్రేయస్సు కోసం పని చేసే సర్పంచ్ ఉండడం పట్ల సర్పంచ్ కాట్రావత్ చిట్టెమ్మ శంకర్‌నాయక్‌ను అభినందనలు తెలిపారు.

## జాతీయ స్థాయి చదరంగం క్రీడలకు ఎంపికైన చిద్విలాసినికి అభినందనలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చదరంగం క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పాఠశాల క్రీడలకు ఎంపికైన కుమ్మరికుంట్ల చిద్విలాసినిని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం మిర్యాలగూడలో ఆమెను ఘనంగా అభినంది మాట్లాడారు. చిన్న వయసులోనే చెస్ క్రీడలో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఇటు మిర్యాలగూడ ప్రాంతానికే కాకుండా రాష్ట్రానికే ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. చిద్విలాసిని తన పట్టుదల, కృషితో జాతీయ స్థాయిలోనూ సత్తా చాటి తెలంగాణ పేరును నలుదిశలా చాటాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో క్రీడారంగంలో మరెన్నో విజయాలు సాధిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తోటి విద్యార్థులందరికీ స్ఫూర్తిగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి దుర్గయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్లావత్ సైదానాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు లావూరి రవీందర్‌నాయక్, నక్క నాగరాజు, కుమ్మరికుంట్ల సుధాకర్, ఆలంపల్లి సైదులు, చరణ్ తేజ, కార్తీక్, శశాంక్, రాంబాబు యాదవ్, మధునాయక్ పాల్గొన్నారు.





## ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని యోగా క్లబ్ మిర్యాలగూడ సభ్యులు నిరూపించారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న పేద దివ్యాంగుడు బాసాని లక్ష్మీనారాయణకు యోగా క్లబ్ ఆధ్వర్యంలో రూ.25,555 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన గురూజీ చీదల్ల వెంకటేశ్వర్లు, పైడిమర్రి సురేష్, కంచర్ల వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, సముద్రాల నాగభూషణం, మజ్జిగపు అంజిరెడ్డి, శీలం చంద్రయ్య, జానపాటి శ్రీనివాస్, మాదా నాగేశ్వరరావు, బొగ్గారం శ్రీనివాస్, కొట్టే వెంకటయ్య, భీమ్లానాయక్, రమేష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కర్నాటి శేఖర్, అంబటి వీరనారాయణ పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా మిర్యాలగూడ పట్టణంలోని నవజ్యోతి పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం డాక్టర్ గోపాలం శివన్నారాయణ పర్యవేక్షణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వందలాది మంది ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సేవలు అందించారు. జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా ప్రజలకు సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మూర్ఛ, పక్షవాతం, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కీర్తిశేషులు పాదురి రామ్ సుందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి పాదురి కరుణ ఈ ఉచిత వైద్య శిబిరంలో మందుల పంపిణీ నిమిత్తం రూ.35 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, డాక్టర్ సాహితీ, డాక్టర్ హితేష్, పాదూరి రమణారెడ్డి, కోలా శ్రీనివాస్, సత్యనారాయణ రావు, బక్కా శ్రీనివాస చారి, మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, కోటానాయక్, కేశవులు, నక్క శ్రీనివాస్, బొచ్చు కోటి రెడ్డి, శోభా రాణి, జయరాజు, శ్రీనివాసరావు, కోటియా, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం సూర్యాపేట జిల్లాలో మహిళలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో ఉదయమే కొత్త బట్టలు ధరించి బతుకమ్మను పేర్చి అందులో పసుపుతో తయారు చేసిన గౌరమ్మను మీద పెట్టి ఇంట్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళలో ఆయా ప్రాంతాల్లో బతుకమ్మల చుట్టూ చేరి సాంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలు ఆడి అనంతరం దగ్గరలోని చెరువులు, కుంటలు, కాలువల్లో నిమజ్జనం చేశారు. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి, డిజె సౌండ్‌లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. బతుకమ్మ పండుగ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాపక్షం/అర్వపల్లి :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయంగా తెలుగింటి ఆడపడుచులకు తీరొక్క పూలతో రంగులను అలంకరించి ఆనందోత్స



వాలతో మహిళలు కోలాటాల మధ్య తెలంగాణ పూల పండుగ అయిన సద్దుల బతుకమ్మ సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచులు చిల్లంచర్ల విద్యాసాగర్, వింగి కృష్ణమూర్తి, కర్నాటి వెంకన్న, వీరాంజనేయులు, వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని సర్పంచ్ వేమూరి సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో శ్రీకోదండ రామస్వామి కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన





సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ఏర్పాట్లను సర్పంచ్ సత్యనారాయణ పరిశీలించి మాట్లాడారు.

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పట్టణంలోని ది పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ఆదివారం బ్యాంకు సిబ్బందితో కలిసి మహిళా ఉద్యోగులు రంగు రంగు పూలతో బతుకమ్మలు అందంగా పేర్చి ఆటపాటలతో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ తడక రమేష్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగగా ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్ డైరెక్టర్లు, సీఈవో సీత శ్రీనివాస్, మేనేజర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









## దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గా మాతను ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు నర్రా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని కొండమల్లేపల్లి గ్రామ సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి కోరుకున్నారు. మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల దుర్గానగర్ కాలనీలో శ్రీ ఆంజనేయస్వామి దుర్గామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం అమ్మవారు కనక దుర్గా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజ అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రంలోని భవాని నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గమాత విగ్రహం వద్ద కనకదుర్గ అవతారంలో దర్శనమిచ్చారు. దేవి నవరాత్రుల సందర్భంగా బెజవాడ గోవర్ధన్‌నర్సమ్మ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో సుమారు 1500 మందికి అన్నదాన వితరణను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లపాటి శ్రీనివాసరావు, దేవినేని వాసు, భవానినగర్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని సర్పంచ్ నాతాల వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని గాజులమల్కాపురం గ్రామంలో దసరా నవరాత్రుల సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి సంయుక్త, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న 45 మంది పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాల కొనుగోలు కోసం తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ ఆదివారం అందజేశారు. తన స్వగృహంలో ఏర్పాటు చేసిన 'దసరా పండుగ అలాయ్ బలాయ్' కార్యక్రమంలో కార్మికులను శాలువాలతో సన్మానించారు. అనంతరం వారికి వస్త్రాల కొనుగోలు కోసం రూ. 22వేల500 నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికునికి రూ. 5లక్షల ప్రమాద బీమాను తమ సంఘం తరపున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల లక్ష్మయ్య, రుద్రవరం ఇస్తారి, గుండె దుర్గయ్య, దొడ్డి భిక్షమయ్య, జనపాల జ్యోతి, పులిగిల్ల పద్మ, బాకీ అండాలు, పోకల లావణ్య పాల్గొన్నారు.